జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 5-11-2024 శ్రీకాకుళం సంపుటి: 2 సంచిక: 154 పేజీలు: 8 వెల : రూ.7



# కలెక్టర్ ఆదేశాలు.. బేఖాతర్

**శ్రీకాకుళం, నవంబర్4 (వార్త):** జిల్లా కలెక్టర్ ఆదేశాలను మండల రెవెన్యూ, పరిషత్ అధికారులు పట్టించుకోవడం లేదు. మండల రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం మీకోసం నిర్వహించకపోవడం, తూతూమంత్రంగా చేపడుతుండడంతో అర్జీదారులు జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు తరలివస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు అందిస్తున్నారు. దీంతో శ్రీకాకుళం జడ్పీలో నిర్వహించే మీకోసం అర్జీదారులతో కిటకిటలాడుతోంది. ఎక్కువగా రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వస్తున్నాయి. ఈ సమస్యలను మండల స్థాయిలో పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత మండల అధికారులు చొరవ తీసుకోవడం లేదన్న విమర్శలు లేకపోలేదు. జడ్పీలో నిర్వహించే మీకోసం వచ్చే అర్జీలు కూడా రిపీటెడ్‌గానే వస్తున్నాయి. అర్జీదారుడు జడ్పీలో తన సమస్యపై అర్జీ ఇచ్చిన వెంటనే సంబంధిత శాఖ అధికారులకు జిల్లా అధికారులు రెఫర్ చేస్తుంటారు. సమస్య పరిష్కారం కాకపోతే అర్జీదారుడికి సమాచారం అందించాలని కూడా కలెక్టర్ పలుమార్లు సూచించారు. మండల అధికారులు అర్జీదారుడికి ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడంతో అదే సమస్యపై మళ్లీమళ్లీ జడ్పీలో నిర్వహించే మీకోసంకు ఫిర్యాదులు ఇస్తున్నారు. ప్రతి సోమవారం జడ్పీలో నిర్వహించే మీకోసంకు సుమారు 120కిపైనే అర్జీలు అందుతున్నాయి. వాటిలో సగానికిపైగా అర్జీలు పాతవే ఉంటున్నాయి.

* మండల స్థాయిలో మీకోసం నిర్వహించాలని పలుమార్లు కలెక్టర్ ఆదేశాలు
* పట్టించుకోని రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు
* జిల్లా కేంద్రంలో నిర్వహించే మీకోసంకు పోటెత్తుతున్న అర్జీదారులు
* మండల స్థాయిలో పరిష్కారం కావడం లేదని జిల్లా అధికారుల వద్ద గగ్గోలు
* రీఓపెనింగ్ అర్జీలే అధికం



## మండల స్థాయిలో మీకోసం నిర్వహించండి

*** జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

మండల స్థాయిలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం పన్నెండు గంటల నుంచి ఒంటిగంట వరకూ మండల స్థాయి కమిటీ సభ్యులు పాల్గొని సంబంధిత సమస్యలు సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. రీ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలు పరిష్కరించాలన్నారు. మీకోసం (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) అర్జీలు పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత నివ్వాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) మీకోసం కార్యక్రమం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జరిగింది. ప్రజల నుంచి 204 అర్జీలను కలెక్టర్‌తో పాటు జిల్లా రెవిన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజు, ఉప కలెక్టర్ అప్పారావు స్వీకరించారు. సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన దరఖాస్తులు పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో కె.భారతీసౌజన్య, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా.బి.మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి.ప్రసాదరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ గెడ్డెమ్మ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతి శ్రీ, డ్వామా పీడీ బి.సుధాకర్‌రావు, డీసీహెచ్ఎస్ డా.కళ్యాణబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పోటా.. పోటీగా!

* ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు
* కడప ఫస్ట్, విశాఖ సెకండ్
* ఎనిమిది పతకాలతో సత్తా చాటిన సిక్కోలు క్రీడాకారులు



**శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 4(వార్త):** కోడి రామ్మూర్తి స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు సోమవారం ముగిసింది. ఓవరాల్ చాంపియన్‌గా కడప జిల్లా నిలిచింది. 11 బంగారు, నాలుగు రజిత, ఒక కాంస్య పతకాలు సాధించారు. విశాఖ జిల్లా ఐదు బంగారు, 10 రజిత, ఐదు కాంస్య పతకాలతో ద్వితీయస్థానంలో నిలిచింది. తూర్పుగోదావరి జిల్లా ఐదు బంగారు, ఒక రజిత, ఐదు కాంస్య పతకాలు, శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు ఒక బంగారు, నాలుగు రజిత, మూడు కాంస్య పతకాలు సాధించారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా నాలుగు బంగారు, రెండు రజిత, మూడు కాంస్య పతకాలు, గుంటూరు జిల్లా మూడు బంగారు, నాలుగు రజిత, మూడు కాంస్య పతకాలు, కృష్ణ జిల్లా ఒక బంగారు, మూడు రజిత, రెండు కాంస్య పతకాలు సాధించాయి. ప్రకాశం జిల్లాకు చెరో బంగారు, కాంస్య పతకాలు, కర్నూలు జిల్లాకు మూడు బంగారు, రెండేసి రజిత, కాంస్య పతకాలు వచ్చాయి. అనంతపురం జిల్లా చెరో బంగా, రజిత, మూడు కాంస్య పతకాలు సాధించగా, నెల్లూరు ఒక రజితం, రెండు కాంస్య పతకాలు, చిత్తూరు జిల్లాకు ఒక కాంస్య పతకం వచ్చింది. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని నువ్వానేనే అన్నట్టుగా తలపడ్డారు. క్రీడాకారులకు ఇబ్బందులు కలుగకుండా కోచ్‌లు, నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. అయితే క్రీడాకారులు మాత్రం ఉదయం అల్పాహారం విషయంలో కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం క్రీడాకారులకు అల్పాహారం కింద ఉప్మా, గుడ్డు మాత్రమే ఇచ్చారు. దీంతో క్రీడాకారులు స్టేడియం ఆవరణలో ఉన్న హొటళ్లకు బారులు దీరడం కనిపించింది.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## హెూంగార్డు కుమారునికి నియామక పత్రం

**శ్రీకాకుళం క్రైం, నవంబర్4 (వార్త):** శ్రీకాకుళం జిల్లా హెూంగార్డ్ యూనిట్‌లో టి.కాంతారావు హెూంగార్డుగా విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ఆగస్టు నెలలో మరణించారు. ఈ మేరకు ఆయన కుమారుడు సత్యనారాయణకు కారుణ్య నియామకం ప్రకారం హెూంగార్డుగా నియమిస్తూ నియమక పత్రాన్ని సోమవారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అందజేశారు. రాష్ట్ర చీఫ్ ఆఫీస్ సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి మంజూరైన రూ.40 వేలు నగదు చెక్కును కాంతారావు సతీమణి లక్ష్మికి ఎస్పీ అందించారు. కార్యక్రమంలో ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు డీఎస్పీ ఎల్.శేషాద్రి, డీపీవో ఏవో సీహెచ్ గోపీనాథ్ పాల్గొన్నారు.

## దళిత మహిళ కుటుంబానికి.. న్యాయం చేయండి

***సాయి బాపూజీ లేడిస్ వరల్డ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి *అనుమతులు లేకుండా లిఫ్ట్ ఏర్పాటు చేసి నిండి ప్రాణాన్ని బలితీసుకున్నారు *కనీసం మానవతా దృక్పథంతోను కుటుంబాన్ని పరామర్శించలేదు *షాపులో ప్రమాదం జరిగితే రోడ్డు మీద పడిపోయినట్లు సమాచారం అందజేశారు *మహిళ మరణంతో పిల్లలు పెద్ద దిక్కు కోల్పోయారు *సంఘటనపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలి *జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డిని కోరిన దళిత సంఘాల జెఏసి నేతలు *తక్షణం చర్యలు చేపట్టాలని టూటౌన్ పోలీసులకి ఆదేశాలు ఇచ్చిన ఎస్పీ *దళిత జెఏసి నేతలను ఆశ్రయించిన మహిళ కుటుంబ సభ్యులు *మృతురాలి పిల్లలతో కలిసి ఎస్పీని కలసిన దళిత జెఏసి నేతలు**

**శ్రీకాకుళం క్రైం, నవంబరు 4 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని చిన్నబజార్ జంక్షన్ వద్ద గల సాయి బాపూజీ లేడిస్ వరల్డ్ షాపులో లిఫ్ట్‌లో ప్రమాదానికి గురై మృతి చెందిన లండ నిర్మల అలియాస్ లక్ష్మి కుటుంబానికి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డిని దళిత సంఘాల జెఎసి నేతలు కోరారు. ఆ షాపు యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణం పోయిందని చట్ట ప్రకారం సదరు యజమానులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మృతురాలు కుమారుడు లండ పవన్, కుమార్తె లండ లహరిలతో కలసి దళిత సంఘాల జెఏసి నేతలు డా.కంఠ వేణు, తైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వర రెడ్డికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. గత నెల 30న లండ నిర్మల షాపింగ్ కోసం సాయి బాపూజీ లేడిస్ వరల్డ్ షాపుకి వెళ్లగా అక్కడ లిఫ్ట్ సక్రమంగా పనిచేయక ప్రమాదానికి గురై మృతి చెందినట్లుగా కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నేతలు ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. షాపులో తమ తల్లి ప్రమాదానికి గురైతే ప్రకాశ్ బాబు ఓల్డ్ బుక్ స్టాల్ వద్ద రోడ్డు మీద కళ్లు తిరిగిపడిపోయినట్లుగా సదరు యజమాని హైదరాబాద్‌లో ఉన్న తమకి ఫోన్ చేసి అబద్ధం చెప్పారని పిల్లలు ఆవేదనను వ్యక్తం చేశారు. తమ స్నేహితులను వెంటనే సంఘటనా స్థలానికి పంపించి ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లుగా తెలియజేశారు. తల్లి మృతి సమాచారం తెలిసినా కనీసం మానవతా దృక్పథంతోనైనా సాయిబాపూజీ వరల్డ్ యాజమానికి స్పందించలేదని వారు వాపోయారు. ఎటువంటి అనుమతులు లేకుండా షాపులో సదరు యాజమాన్యం లిఫ్ట్‌ను ఏర్పాటు చేసి దాని నిర్వహణను పట్టించుకోకపోవడం వల్లనే ప్రమాదం జరిగి నిర్మల మృతి చెందినట్లుగా వారు



ఆరోపించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ దర్యాప్తును పూర్తి స్థాయిలో చేయలేదని, కనీసం సమాచారం కూడా తమకు ఇవ్వలేదని, ఎఫ్ఐఆర్ కాపీని కూడా తమకి అందజేయలేదని వారు ఎస్పీ దృష్టికి తీసుకువెళ్ళారు. తక్షణం స్పందించిన ఎస్పీ వెంటనే టూటౌన్ పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు. సంఘటన జరిగిన తర్వాత దర్యాప్తు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లండ నిర్మల మృతి సంఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని ఆ కుటుంబానికి న్యాయం చేయాలని స్పష్టం చేశారు.

### యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సాయి బాపూజీ వరల్డ్ షాపు యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే దళిత మహిళ లండ నిర్మల ప్రాణాలు పోయాయని దళిత సంఘాల జెఏసి నేతలు ఆరోపించారు. జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డికి వినతిపత్రం అందజేసిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. మానవతా దృక్పథంతో కూడా సదరు షాపు యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. సంఘటన షాపులో జరిగినా రోడ్డు మీద జరిగినట్లుగా తప్పుడు సమాచారాన్ని కుటుంబ సభ్యులకి ఇవ్వడం వెనుక అనుమానాలను వారు వ్యక్తం చేసారు. అస్సలు ఆ షాపులో లిఫ్ట్ ఏర్పాటుకి అనుమతులు ఉన్నాయో లేదో కూడా తెలియని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. లిఫ్ట్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్లనే ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తోందని వారు తెలియజేశారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు సాయి బాపూజీ వరల్డ్ యాజమాన్యం ప్రయత్నిస్తున్నట్లుగా ఉందని అనుమానాలు వ్యక్తం చేశారు. దళిత మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన వెంటనే స్పందించి టూటౌన్ పోలీసులకి ఆదేశాలు ఇచ్చారన్నారు. ఆ కుటుంబానికి న్యాయం చేసి గతంలో తండ్రిని ఇప్పుడు తల్లిని కోల్పోయిన పిల్లలను ఆదుకోవాలని దళిత సంఘాల జెఏసి నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో ఓంపూరి రమేష్, కళ్లేపల్లి హరికృష్ణ, అబ్బాస్, కళ్యాణ్, పెయ్యల చంటి, పంకు మురళీ, ముత్యాలమ్మ, పార్వతీ, రాంబాయి, మల్లేశ్వరి, భారతి, పూర్ణిమ పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

### జిల్లా అదనపు పర్యవేక్షణ అధికారి బీవీ రవికుమార్

**శ్రీకాకుళం, నవంబర్ 4(వార్త):** బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని జిల్లా అదనపు పర్యవేక్షణ అధికారి బీవీ రవికుమార్ తెలిపారు. బాలల సంరక్షణ కేంద్రాలు నడుపుతున్న సంస్థలకు లేదా వ్యక్తులకు జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం 2015, సవరించబడిన చట్టం 2021 లోని సెక్షన్ 41 ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవలసినదిగా సంచాలకులు, బాలల సంక్షేమము, సంస్కరణల సేవల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత నెల 22న స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. బాలల సంరక్షణ కేంద్రాలుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకున్న వారు నిర్దేశించబడిన ప్రొఫార్మాలో నింపబడిన దరఖాస్తుతో పాటు, అన్ని కాపీలు జతచేసిన దరఖాస్తును ఈనెల 11లోగా సంచాలకులు, బాలల సంక్షేమము, సంస్కరణల సేవలు మరియు వీధిబాలల సంక్షేమశాఖ, విజయవాడ, కార్యాలయానికి పంపించాలన్నారు. దీనికి సంబంధించిన పూర్తి నోటిఫికేషన్, చిరునామా, అర్హతలు, జాతపరచాల్సిన డాక్యుమెంట్లు చెక్ లిస్టులు మొదలైనవాటిని http://wdcw.ap.gov.in అనే వెబ్‌సైటు పొందవచ్చునని తెలిపారు. దరఖాస్తులను స్పీడ్ పోస్ట్ లేదా రిజిస్టర్ పోస్ట్ ద్వారా, సాఫ్ట్ కాపీలను cci.reg2024gmail.comకి మెయిల్ ద్వారా రెండింటిని ఖచ్చితంగా పంపాలని స్పష్టం చేశారు. మరింత సమాచారం కావలసిన వారు శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి బి. వి. రవికుమార్ అదనపు జిల్లా పర్యవేక్షణ అధికారి, 9100045398 వారిని లేదా కె.వి.రమణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి 9440035576 వారిని సంప్రదించవచ్చునని సూచించారు.

## ఫిర్యాదులు చట్ట ప్రకారం పరిష్కరించాలి

### ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం క్రైం, నవంబర్4 (వార్త):** ప్రజా ఫిర్యాదులు స్వీకరణ మరియు పరిష్కారం కార్యక్రమంలో వచ్చే ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ, చట్ట ప్రకారం పూర్తి స్థాయిలో పరిష్కారానికి చర్యలు చేపట్టి త్వరిత గతిన పరిష్కరించాలని, చట్ట పరిధిలో చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో 65 మంది నుంచి అర్జీలను ఎస్పీ స్వీకరించారు. ప్రజా ఫిర్యాదులు పట్ల అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని పోలీసు అధికారులకు సూచించారు.

### ఎస్పీని కలిసిన సీఐ ఈశ్వరరావు



ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం రెండవ పట్టణ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.ఈశ్వరరావు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అలాగే ఏపీఎస్పీ మొదటి బెటాలియన్ (ఎచ్చెర్ల) అసిస్టెంట్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.గోపాల్ కృష్ణ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.




## టెట్‌లో సత్తా చాటిన కృష్ణారావు

**మెళియాపుట్టి, నవంబరు 4 (వార్త):** టెట్ ఫలితాల్లో మెళియాపుట్టి మండలం కొసమాల గ్రామానికి చెందిన పెద్దింటి కృష్ణారావు సత్తా చాటాడు. 150 మార్కులకు 145.15 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కన బరిచారు. జనసేన పార్టీ పాతపట్నం నియోజకవర్గ నాయకురాలు కొరికాన భవానీ పాతపట్నంలో ఏర్పాటు చేసిన కొరికాన కాంపిటేటివ్ సెంటర్‌లో కృష్ణా రావు కోచింగ్ తీసుకున్నాడు. టెట్‌లో సత్తా చాటిన కృష్ణారావును జనసేన నాయకులు బాలరాజు, చంటి సోమవారం దుశ్శాలువ కప్పి సత్కరించి అభినం దించారు. అలాగే కొరికాన కాంపిటేటివ్ సెంటర్‌లో శిక్షణ పొందిన మరి కొంతమంది మంచి ర్యాంకులు సాధించారని నిర్వాహకులు తెలిపారు.

## సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్‌కు వినతి



**పలాస, నవంబర్ 4 (వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డులో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ వార్డు కౌన్సిలర్ సర్వాన గీతారవి మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుకు సోమ వారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే మున్సిపల్ కమిషనర్ రామారావు దృష్టికి సమస్యలను తీసుకువెళ్లారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొత్త పారసాంబలో తాగు నీటి పైపులు పాడవడంతో కాలనీ వాసులు నీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. దళిత వీధిలో విద్యుత్ పోల్స్, సిసి రహదారులు ఏర్పాటు చేయాలని కోరారు. పాఠశాల నుంచి ముత్యాల పోలమ్మ ఆలయం వరకు సిసి రోడ్డు ఏర్పాటు కు నిధులు కేటాయించాలని, జాతీయ రహదారి నుంచి గ్రామం వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయా లన్నారు. జక్కర గుండాన్ని పార్క్‌గా అభివృద్ధి చేయాలన్నారు. పదో వార్డులోని సమస్యలను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకువెళతామని గీతారవి తెలియజేశారు.

## సైనిక కార్పొరేషన్ ఏర్పాటు హర్షనీయం



**పాతపట్నం,నవంబర్4(వార్త):** మాజీ సైనికుల సంక్షేమానికి 10 కోట్ల రూపాయలతో కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలోని మాజీ సైనికుల సంక్షేమ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల పరిపాలనలో రాష్ట్రంలో మాజీ సైనికుల సంక్షేమం కోసం 10కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సుబేదార్ రామారావు, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## 13న అరసవల్లిలో తెప్పోత్సవం

**అరసవల్లి, నవంబర్ 4(వార్త):** ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్య నారాయణస్వామి దేవస్థానం ఆవరణలో ఉన్న ఇంద్ర పుష్కరిణిలో ఈనెల 13న క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా తెప్పోత్సవం నిర్వహించనున్నామని ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారిని దేవేరులతో సహా హంసవాహనంపై ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను చేస్తున్నామని తెలిపారు.

## రైస్ మిల్లుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

**ఎల్ఎన్‌పేట, నవంబరు 4 (వార్త):** పెద్దకొల్లివలస సమీపంలోని దమయంతి మోడ్రన్ రైస్ మిల్ రేకుల షెడ్ నుంచి జారిపడి సాహుకారి వెంకట రమణ అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిల్లుకు సోలార్ ప్లేట్లు వేసేందుకు వెంకటరమణతో పాటు నాయుడు కొలతలు వేస్తుండగా సిమెంట్ రేకులు పగిలి వీరిద్దరూ కిందకు జారిపడ్డారు. వెంకట రమణ అక్కడికక్కడే మృతి చెందగా, నాయుడికి గాయాలయ్యాయి. సరుబుజ్జిలి ఇన్ఛార్జ్ ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.





జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## హరిపురంలో రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

**మందస, నవంబర్ 4(వార్త):** మందస మండలంలోని హరిపురంలో గల శాతవాహన కళాశాల రోడ్డు పక్కన గున్నయ్యగారి కాంప్లెక్స్‌లో ఈనెల 6న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు శంకర్ ఫౌండేషన్ క్యాంప్ జూనియర్ మేనేజర్ టి.రామారావు తెలిపారు.

జిల్లా అంధత్వ నివారణ సౌజన్యంతో ఆ రోజు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరానికి వచ్చే రోగులు తప్పనిసరిగా ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, రెండు జతల దుస్తులు, ప్లేట్, గ్లాస్ తీసుకురావా లని సూచించారు. మరిన్ని వివరాలకు 9848907299 అనే ఫోన్ నంబరుకు సంప్రదించాలని కోరారు.

# నైపుణ్య గణనతో ఆర్థికాభివృద్ధి





**పోలాకి, నవంబర్ 4(వార్త):** నైపుణ్య గణనతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని నరసన్నపేట శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి అన్నారు. పోలాకి మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన నైపుణ్య గణన శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధి అవకాశాల కల్పనకు నైపుణ్య గణన ఎంతో ప్రామాణిక మన్నారు. ఈ సర్వేకు పూర్తి స్థాయిలో యంత్రాంగం సిద్ధం కావాలని కోరారు. ముఖ్యమంత్రి తొలి ఐదు సంతకాలలో నైపుణ్య గణన (స్కిల్ సెన్సస్) ఒకటని అన్నారు. యువతకు అవసరమైన నైపుణ్యాలలో శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ సర్వేను చేపట్టినట్లు తెలిపారు. ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మసీ, డిప్లమా కళాశాలలను గుర్తించి అక్కడి విద్యార్థులకు నైపుణ్య గణన ప్రాముఖ్యతను వివరించి స్వీయ గణన చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసున్న ప్రతి ఒక్కరి డేటా సేకరించాలని సూచించారు. దీనిపై ఎవరికి ఎటువంటి సందేహాలున్నా నివృత్తి చేసి నైపుణ్య గణన ఉపయోగాలను వారికి ఓపిగ్గా వివరించాలన్నారు.

శిక్షకుడు గుజ్జల గౌతం మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే నైపుణ్య గణన కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో మండల గ్రామ, వార్డు సచివాలయాల కోఆర్డినేటర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్దానం ముద్దుబిడ్డ జుత్తు జగన్నాయకులు

**-ఘనంగా నివాళులు అర్పించిన నాయకులు**

**మందస, నవంబర్ 4(వార్త):** ఉద్దానం ముద్దుబిడ్డ స్వర్గీయ జుత్తు జగన్నాయకులని పలువురు నాయకులు కొనియాడారు. పలాస తొలి ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకుల 7వ వర్ధంతి పలు చోట్ల ఘనంగా జరిగింది. జగన్నాయకులు స్వగ్రామమైన బిడిమిలోని ఆయన ఘాట్ వద్ద భార్య జుత్తు ధనలక్ష్మి, సోదరుడు జుత్తు నీలకంఠం ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్దానం ప్రాంత ప్రజల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించిన ప్రజా నాయకుడు జగన్నాయకులే అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఒక సామాన్య కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టి శాసన సభ్యుడిగా ఎన్నికైన ఘనత ఆయనదే అన్నారు. జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో తన చివరి ఊపిరి వరకు వైస్సార్సీపీలో





ఉంటూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన నాయకుడన్నారు. హరిపురంలో గ్రామ సర్పంచ్ జగన్నాథపురం పురుషోత్తం, శ్రీరాములు, నారాయణపురంలో గ్రామ సర్పంచ్ బత్తిని తేజేశ్వరరావు, బేతాళపురంలో గ్రామ సర్పంచ్ మామిడి సింహాద్రి, బత్తిని లక్ష్మణ్ గారి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమాల్లో క్లస్టర్ ఇన్‌చార్జి దున్న హరికృష్ణ, వార్డ్ మెంబర్ సంగారు కృష్ణారావు, జిల్లా అగ్నికుల క్షత్రియ అధ్యక్షుడు మడియా రామకృష్ణ, తాడల అప్పలస్వామి, గ్రామ పార్టీ అధ్యక్షుడు తాడాల దామోదర్, గ్రామ సెక్రటరీ మడియా రుషి, బైపల్లి నారాయణ, పల్లేటి రూపారావు, కీలు మోహన్ రావు, యువజన నాయకులు గుంటు కపిల్, దున్న దుర్యోధన, జుత్తు నారాయణ, చీకటి ప్రసాద్, తాడాల గణపతి, అంబటి మోహన్, అంబటి దుర్యోధన, తామాడ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సత్ప్రవర్తనతోనే సమాజంలో గుర్తింపు

**పోలాకి, నవంబర్ 4(వార్త):** సత్ప్రవర్తనతోనే సమాజంలో మంచి గుర్తింపు పొందవచ్చని నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన గుప్పెడిపేటలో చట్టాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్పించుకుని గౌరవించాలని కోరారు. సన్మార్గం ద్వారా యువత మంచి గుర్తింపు పొందాలని సూచించారు. లక్ష్యసాధనకు యువత కృషి చేయాలని, ఆకతాయి పనులకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తూ ఉన్నత ఉద్యోగం పొందడానికి కృషి చేయాలని సూచించారు. చిన్న, చిన్న సమస్యలు, తగాదాలు లేకుండా గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, వీటిపై యువత పజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

పోలాకి ఎస్ఐ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ సమస్యలు లేని గ్రామంగా మంచి గుర్తింపు పొందాలని సూచించారు.

కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల మహిళ అధ్యక్షు రాలు లబ్బ ధనలక్ష్మి, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు నందుపల్లి దండాశి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## పాగోడు పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

**జలుమూరు, నవంబర్ 4(వార్త):** పాగోడు ఎంపీయూపీ పాఠశాలను ఎంఈవో ఎం.ప్రసాదరావు సోమవారం పరిశీలించారు. అపార్డ్ నమోదు వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు అన్ని వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల అభ్యాసన ప్రక్రియను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం ఏ మేరకు అమలు చేస్తున్నారో తనిఖీ చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

## పాసు పుస్తకాల్లో లోపాలు సవరిస్తాం



**జలుమూరు, నవంబర్ 4(వార్త):** రైతుల వద్ద ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలలో కొనుగోలు, అమ్మకాలు తదితర అంశాలపై జరిగిన లోటుపాట్లను సరిదిద్దేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ తెలిపారు. సోమవారం నరసన్నపేట మండలం పారసెల్లి పంచాయితీ చిట్టియవలసలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 120 మంది రైతులు ఉన్నారని, వారికి సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పీజీ కోర్సులు ప్రారంభం




**జలుమూరు, నవంబర్ 4(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులను ప్రారంభించామని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఆ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ పి.లత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కెమిస్ట్రీ, ఆర్గానిక్ కోర్సులతోపాటు నైపుణ్యాభివృద్ధి రంగంపైన కూడా కోర్సులు ప్రవేశ పెట్టామన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**జలుమూరు, నవంబర్ 4(వార్త):** గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయకుమార్ తెలిపారు. సోమవారం నరసన్నపేట మండలం గోపాలపెంట పంచాయతీలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ గ్రామస్థులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నట్లుగా వచ్చిన సమాచారం మేరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 7న హరిపురంలో క్యాన్సర్ వైద్య శిబిరం

**మందస, నవంబర్ 4(వార్త):** హరిపురంలోని సీహెచ్‌సీలో ఈనెల 7న క్యాన్సర్ మెగా స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ శిబిరం రైజ్ సంస్థల అధినేత డాక్టర్ పుల్లట ప్రవీణ్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. 25 ఏళ్లు నిండిన మహిళలకు మాత్రమే స్క్రీనింగ్, స్కానింగ్, పాప్స్మియర్ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. రోగులు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

## తిలారు అండర్ పాసేజ్ పరిశీలన

జలుమూరు నవంబరు4(వార్త): జలుమూరు మండలం తిలారు అండర్ పాసేజ్ వద్ద నిత్యం నీరు చేరిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు సోమవారం అండర్ పాసేజ్‌ను పరిశీలించారు. పాసేజ్ పక్కనే చెరువు ఉండడం, అది గండిపడటంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని అధికారుల దృష్టికి రామకృష్ణ తీసుకెళ్లారు. వెంటనే పనులు చేపడతామని అధికారులు తెలిపారు.



## శ్రీముఖలింగంలో ప్రత్యేక వైద్య శిబిరం

**జలుమూరు, నవంబర్ 4(వార్త):** శ్రీముఖలింగంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించామని వైద్య అధికారిని పి.సుజాత తెలిపారు. సోమవారం అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న శ్రీ ముఖలింగం కార్తీక మాసం స్వామిని దర్శించుకునేందుకు ఎక్కువగా భక్తులు తరలి వస్తారన్నారు. ఈ క్రమంలో ఆరోగ్య రీత్యా ఎవరు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ శిబిరం ఏర్పాటు చేశామని ఆమె స్పష్టం చేశారు.

## మద్యం సీసాలతో మహిళ అరెస్టు

**జలుమూరు, నవంబర్ 4(వార్త):** సారవకోట మండలం మద్రిపాడుకు సమీపంలో అక్రమంగా తరలిస్తున్న ఆరు మద్యం సీసాలను ఓ మహిళ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కృష్ణారావు తెలిపారు. ప్రస్తుతం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మొబైల్ టీం గ్రామాల్లో తిరుగుతోందని, అక్రమంగా మద్యం కలిగి ఉన్నా, బెల్టు షాపుల ద్వారా విక్రయిస్తున్నా ఆ టీమ్ సభ్యులు చర్యలు తీసుకుంటారన్నారు. మద్యం షాపుల దగ్గర ఎంఆర్పీ చార్ట్ పెట్టాలని సూచించారు.

## ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు



**జలుమూరు, నవంబర్ 4(వార్త):** జలుమూరు మండలం తిలారు ఆర్ఎస్ సమీపంలోని టేకు తోటల్లో జూదమాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్ఐ అశోక్‌బాబు ఆదివారం రాత్రి దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.8060లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎక్కడైనా జూదం ఆడుతున్నట్లుగా సమాచారం వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## కోండ్రు హయాంలో రాజాం అభివృద్ధి



**వంగర, నవంబర్ 4(వార్త):** రాజాం నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని ఆ నియోజకవర్గ టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు మజ్జి గణపతి కొనియాడారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మురళి ఇప్పటికే రోడ్లు తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలో పింఛనర్లు ఒకే పర్యాయం 12 వేలు పింఛను అందుకొనే అవకాశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కల్పించారని, దీంతో ప్రజలకు ఎంతో మేలన్నారు. కూటమి ఎన్నికల్లో ప్రజలకిచ్చిన మరో హామీని నెరవేర్చేందుకు ముందడుగు వేసిందన్నారు. ఇకపై పింఛను మూడు నెలల మొత్తం ఒకేసారి అందించనున్నారన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఒక నెల పింఛను తీసుకోకపోతే కోత వేసేదని, దీంతో పింఛను దారులు నష్టపోయేవారన్నారు.

## సమయ పాలన పాటించాలి

**జలుమూరు, నవంబర్ 4(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా సమయ పాలన తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో పేడాడ దాలినాయుడు తెలిపారు. నరసన్నపేట మండలం రావులవలస ప్రభుత్వ పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలో కొనసాగుతున్న వివిధ కార్యక్రమాలను పర్యవేక్షించారు ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.



# ప్రమోదం కారాదు.. ప్రమాదం..!

- బస్సుల్లో ఫుట్‌పాత్‌పై ప్రయాణిస్తున్న విద్యార్థులు
- భయాందోళనకు గురవుతున్న తోటి ప్రయాణికులు



**జలుమూరు, నవంబర్ 4(వార్త):** చల్లవానిపేట జంక్షన్ వద్ద ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్ ఫుట్‌పాత్‌పై నిలబడి ప్రయాణం చేస్తున్నారు. ఇది ప్రమాదం అని తెలిసి కూడా విద్యార్థులు ప్రయాణించడంతో తోటి ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈవిషయంపై సంబంధిత అధికారులు చొరవ చూపి విద్యార్థులు సురక్షితంగా ప్రయాణించేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని తోటి ప్రయాణికులు కోరుతున్నారు.

# బోధన మెరుగునకు కృషి చేయండి



**వంగర, నవంబర్ 4(వార్త):** పాఠశాలల్లో విద్యా బోధన మెరుగునకు మరింతగా ఉపాధ్యాయులు కృషి చేయాలని విజయనగరం జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ వి.ఆదినారాయణ సూచించారు. సోమవారం ఆయన వంగర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి, ఆరో తరగతి తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యం మరింత మెరుగుపడాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును, రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పలు విద్యా కార్యక్రమాలు, బడి బయట పిల్లల వివరాలు, ల్యాబ్ వినియోగం వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బేసిక్ నాలెడ్జ్‌తో పాటు పాఠ్యాంశాలపై సామర్థ్యాన్ని, భాషా నైపుణ్యతను పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఏఎంవో ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాన్ని మెరుగునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఈ జిల్లా కోఆర్డినేటర్ ఎస్ సూర్యారావు, సీఎంవో కె.రామారావు, ఎంఈవో-2 యాగాటి దుర్గారావు, హెచ్‌ఎం రమణమ్మ పాల్గొన్నారు.

# నిరుద్యోగుల వివరాలు సేకరించాలి

**జలుమూరు, నవంబర్ 4(వార్త):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిరుద్యోగుల వివరాలను నైపుణ్య గణన కార్యక్రమంలో భాగంగా సేకరించాలని ఎంపీడీవో అప్పలనాయుడు తెలిపారు. సోమవారం జలుమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి నైపుణ్య గణనపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 నుంచి 59 ఏళ్ల ఉన్న ప్రతి ఒక్కరి వివరాలను సేకరించాలని స్పష్టం చేశారు.

నోడల్ ఆఫీసర్ ఎంఎన్ పాథక్ మాట్లాడుతూ నిరుద్యోగులకు వారి నైపుణ్యాన్ని బట్టి, వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అలరించిన భజన

**ఇచ్ఛాపురం, నవంబర్ 4(వార్త):** తిప్పన పుట్టుగ త్రిపురేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా నిర్వహించిన భజన అలరించింది. ఆశీ కృష్ణ స్వామి శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి నిర్వహించారు. వయొలిన్‌పై బెందాళం రామారావు, మృదంగం గోనప చందనం వాయిద్య సహకారాన్ని అందించారు. వీజే నాథ్ గాత్ర సహకారాన్ని అందించారు.



# పీవో గ్రీవెన్స్‌కు 200కు పైగా వినతులు



**మెళియాపుట్టి, నవంబర్ 4(వార్త):** సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి నేతృత్వంలో మెళియాపుట్టిలోని ఉపాధి హామీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ సమస్యలపై 200 పైగా వినతులు అందినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, వివిధ ప్రాంతాలకు రహదారుల సౌకర్యం మెరుగుపరచాలని, ఆర్వోఎస్ఆర్ పట్టాలు, గృహాలు మంజూరు చేయాలని, వ్యవసాయ పనిముట్లు అందజేయాలని, పాఠశాల భవనాలు నిర్మించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, రేషన్ కార్డులు, అంగన్‌వాడీ భవనాలు మంజూరు చేయాలని గిరిజనులు విన్నవించారు. మెళియాపుట్టిలో సీహెచ్‌సీ, పాలిటెక్నిక్ కళాశాల, పెట్రోల్‌బంకును సైతం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తి, డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర, ఈఈ రమాదేవి, మండల ప్రత్యేకాధికారి లింగాల వెంకట మధుబాబు, తహసీల్దారు పాపారావు, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, ఇంజనీరింగ్ అధికారులు, వివిధ శాఖాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, గిరిజనులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీముఖలింగం, సంగాంకు పోటెత్తిన భక్తులు





**జలుమూరు, నవంబర్ 4(వార్త):** ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా శ్రీముఖలింగేశ్వరుడు నిజ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్లు 1790, స్వామి వారి ఫొటోలు 42, స్థల పురాణం పుస్తకాలు 43 అమ్ముడయ్యాయని కార్యనిర్వాహణాధికారి పి.ప్రభాకర్ తెలిపారు. రూ.38,680ల ఆదాయం వచ్చిందన్నారు.

**వంగర:** కార్తీక తొలి సోమవారం సందర్భంగా వంగర మండలంలోని సంగాం సంగమేశ్వరుడు ఆలయానికి భక్తులు పోటెత్తారు.

వేకువజాము నుంచే త్రివేణి సంగమం వద్ద వేలాది మంది భక్తులు స్నానాలు ఆచరించి, దీపాలు వెలిగించి, భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి.

ఎం.సీతారాంపురం, తలగాం, వంగర, మడ్డువలస, రాజుల గుమ్మడ, వీవీఆర్ పేట, కొప్పరవలస, కొత్తవలస, గీతనాపల్లి, నీలయ్యవలస, అరసాడ గ్రామాల్లోని శివాలయాల్లో స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. దీంతో ఆలయాల్లో కార్తీక శోభ సంతరించుకుంది.





# అర్హులందరికీ 3 ఉచిత సిలిండర్లు అందించాలి




**వంగర, నవంబర్ 4(వార్త):** వంగర గ్యాస్ ఏజెన్సీ గోదాంను సీఎస్ డీటి పిన్నింటి రామారావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యజమాని టి.వెంకటరమణను గ్యాస్ ఏజెన్సీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీపం 2 పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా 3 సిలిండర్లు అందించాలని ఆదేశించారు. అనంతరం రికార్డులు, లబ్ధిదారులు, ఈ కేవైసీ వివరాలను పరిశీలించారు. అనంతరం వంగర హైస్కూల్‌ను సందర్శించారు. వంట ఏజెన్సీ వివరాలను పాఠశాల హెచ్‌ఎం రమణమ్మను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వండి పెడుతున్న వంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, పిల్లల వివరాలను, వారికి ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పౌష్టికాహారాలను అడిగి తెలుసుకున్నారు. పథకాలు పక్కాగా అమలు జరగాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సూచించారు. ఆయన వెంట ఎంఈవో వై.దుర్గారావు ఉన్నారు.



## కాగువాడ గురుకుల సిబ్బందికి మెమోలు

**పాతపట్నం, నవంబర్ 4(వార్త):** కాగువాడ బాలికల గురుకుల పాఠశాలను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధులలో నిర్లక్ష్యం వహించిన పలువురు సిబ్బందికి మెమోలు జారీ చేశారు. ఉద్యోగులు సమయ పాలన పాటించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కొండవూరు రోడ్డుకు శంకుస్థాపన



**వజ్రపుకొత్తూరు, నవంబర్ 4(వార్త):** కొండవూరు నుంచి రెయ్యిపాడు వరకు బీటీ రోడ్డునకు ఎంపీటీసీ సభ్యుడు సూళ్ల చిట్టిబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. సుమారు 2 కిలోమీటర్ల రోడ్డునకు రూ.1.50కోట్లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కోనారి కిరణ్‌కుమార్, కోనారి మల్లేష్, కీలు మాధవరావు, సూళ్ల శాంతారావు, కీలు ఎర్రన్న, వెంకటస్వామి, చిన్నారావు పాల్గొన్నారు.

## నీలాపుపుట్టుగలో 42 మందికి ఉచిత గ్యాస్



**ఇచ్ఛాపురం, నవంబర్ 4(వార్త):** నీలాపుపుట్టుగ గ్రామంలో 42 కుటుంబాలకు దీపం-2 పథకం కింద గ్యాస్ సిలిండర్‌లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, కామేశ్వరరావు, హరికృష్ణ, నరేంద్ర, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులకు భూమి పూజ

**ఇచ్ఛాపురం, నవంబర్ 4(వార్త):** మండపల్లి పంచాయతీ బుడ్డేపుపేట బాబా గుడి నుంచి స్నానాల చెరువు వరకు చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ ప్రతినిధి పిట్ట మామయ్యరెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో ఈ పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఆసి పేరయ్య, బుడ్డీపు మామయ్య, తిప్పన కూరయ్య, మోహనరావు పాల్గొన్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413